సాక్షి
నంద్యాల
సోమవారం ; 14 ; జూలై ; 2025



ఆయిల్ ట్యాంకర్ బోల్తా

మహానంది: కర్నూలు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఆదివారం గాజులపల్లె సమీపం లోని తెలుగుగంగ కాల్వలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ శివప్రసాదు ప్రాణాలతో బయటపడ్డాడు.



ఉత్తమ రైతుకు సన్మానం

పెద్దకడుబూరు: గతేడాది పత్తిలో అధిక దిగుబడులు సాధించిన తారాపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద అంజనేయ అనే రైతును కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ సన్మానించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.32
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 77.542
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 42,844
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 35,300

పేరుతో ఏమార్చలేక.. అభిమానాన్ని చెరిపేయలేక!

ఆరోగ్యశ్రీ అంటే వైఎస్సార్. వైఎస్సార్ అంటే ఆరోగ్యశ్రీ అనేంతగా ప్రాచుర్యం పొందిన పథకం ఇది. ఎన్ని ప్రభుత్వాలు వచ్చి.. ఎన్నిసార్లు పేరు మార్చినా ఇప్పటికీ ఈ పథకాన్ని ప్రజలు ఆరోగ్యశ్రీగానే పిలుస్తుండటం విశేషం. ఈ పథకానికి వైఎస్సార్ తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగులుదిద్ది ప్రజల అభిమానం చూరగొన్నారు. ఇక వీరిద్దరి పేర్లను ఆ పథకం నుంచి దూరం చేయలేమని భావించిన కూటమి ప్రభుత్వం.. ఏకంగా పథకం రద్దు దిశగా పావు కదుపుతుండటం గమనార్హం.

ఆరోగ్యశ్రీకి మంగళం..!

- ఆయుష్మాన్ భారత్‌కు రంగం సిద్ధం
- ఇప్పటికే ఐదుసార్లు ఉద్యోగులకు శిక్షణ
- నెల రోజుల్లో ప్రారంభించే అవకాశం
- మెడికోకు ప్రీ ఆథరైజేషన్ అధికారం
- ప్రశ్నార్థకంగా ఆరోగ్య మిత్రల భవిష్యత్





కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. జేబులో ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు ఎంతటి కార్పొరేట్ ఆసుపత్రిలోనైనా దర్జాగా ఉచిత వైద్యం చేయించుకునే హక్కును ఆయన పేదలకు కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పథకాన్ని మరింత మెరుగుపరిచారు. గత టీడీపీ ప్రభుత్వంలో 1800లోపు ఉన్న చికిత్సలను వైఎస్ జగన్ 3,255కు పెంచారు. ఈ పథకం ద్వారా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లోనూ వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ పథకానికి ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చింది. అయినప్పటికీ ప్రజలు ఆరోగ్యశ్రీగానే పిలుస్తుండటాన్ని పాలకులు జీర్ణించుకోలేకపోయారు. ఈ పథకాన్ని ఎలాగైనా తొలగించాలనే కుట్రకు ప్రభుత్వం పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఆయుష్మాన్ భారత్‌ను తెరపైకి తీసుకొస్తున్నట్లు తాజా పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. ఈ విషయమై ఇప్పటికే ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఐదు విడతల శిక్షణ కూడా పూరి చేయడం గమనార్హం. మరో నెల రోజుల్లో పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

ఇకపై జిల్లా కలెక్టర్ నుంచి నిధులు

ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా సంబంధిత నెట్‌వర్క్ ఆసుపత్రులకు క్లెయిమ్ అమౌంట్ విడుదలవుతోంది. ఆయుష్మాన్ భారత్ అమలులోకి వస్తే క్లెయిమ్ అప్రూవల్ ఇచ్చాక నిధులను జిల్లా కలెక్టర్ నుంచి విడుదల చేయనున్నట్లు సమాచారం. నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఏవైనా ఫిర్యాదులు వచ్చినా జిల్లా కలెక్టర్ నేరుగా చర్యలు తీసుకునే అధికారం కల్పించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సైతం ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేస్తేనే నిధులు ఇస్తామని చెప్పినట్లు చర్చ జరుగుతోంది. ఏడాది కాలంగా కేంద్రం ఇస్తున్న నిధులను ఇతర పథకాలకు వాడుకుంటున్నారనే సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆయుష్మాన్ భారత్ అమలుకు ప్రత్యేకంగా ఒక మెడికోను ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం.

ప్రైవేటు ఆసుపత్రులు ఒప్పుకుంటాయా...!

- ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎత్తివేసి ఆయుష్మాన్ భారత్‌ను తీసుకొచ్చే యోచనలో కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.
- ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పథకం అమలులో ఉంది.
- కాగా ఆరోగ్యశ్రీ కంటే ఆయుష్మాన్‌భారత్‌లో వ్యాధుల సంఖ్య 1900లోపే ఉండటం, ప్యాకేజి కూడా తక్కువగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రు లు దీనిపై నిరాసక్తి చూపుతున్నట్లు సమాచారం.
- ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేసి 1900 వ్యాధులపైబడిన వ్యాధులను బీమా పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది.
- ఈ మేరకు నూతన ఆరోగ్య పాలసి రూపొందించే పనిలో కూటమి పెద్దలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.



ఎన్‌టీఆర్ వైద్యసేవ కియోస్క్

ఆరోగ్యమిత్రల మెడపై కత్తి

ఆరోగ్యశ్రీ స్థానంలో ఆయుష్మాన్‌భారత్‌ను తీసుకొచ్చి లాగిన్ అవకాశాన్ని సంబంధిత నెట్‌వర్క్ ఆసుపత్రిలోని మెడికో ద్వారా చేపట్టనుండటంతో ఆరోగ్యమిత్రల ఉనికి ప్రశ్నార్థకం కానుంది. ఒకవైపు పథకాన్ని మార్చే పనులు వేగవంతంగా చేస్తున్నా మిత్రల గురించి మాత్రం ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 98 మంది వైద్యమిత్రలు.. నంద్యాల జిల్లాలో 67 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. గత 17 సంవత్సరాలుగా ఇందులో చాలా మంది ఉద్యోగులు ట్రస్టును నమ్ముకుని పనిచేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వీరి మెడపై కత్తి వేలాడ తీస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

ట్రస్ట్‌నే నమ్ముకున్నాం



ఆరోగ్యశ్రీ స్థానంలో ఆయుష్మాన్ భారత్ తీసుకొస్తున్నట్లు తెలిసింది. సంబంధిత నెట్‌వర్క్ ఆసుపత్రిలోని మెడికో ద్వారా లాగిన్ చేపట్టనుండటంతో వైద్యమిత్రల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 165 మంది పనిచేస్తుండగా, చాలా మంది 17 సంవత్సరాలుగా ట్రస్ట్‌నే నమ్ముకున్నారు. ఇప్పటి వరకు మాకు జాబ్ సెక్యూరిటీ, కనీస వేతనం కూడా లేదు. ట్రస్ట్‌లో జరుగుతున్న పరిమాణాలతో వైద్యమిత్రల్లో ఆందోళన నెలకొంది.

– కె.దేవేంద్రనాయక్, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరి, ఏపీ వైద్యసేవ ఎంప్లాయీస్ జేఏసీ

ఉద్యోగుల్లో ఆందోళన



ఆరోగ్యశ్రీ స్థానంలో ఆయుష్మాన్ భారత్ తెస్తారని మాకూ సమాచారం వస్తోంది. కానీ ఇప్పటి వరకు దీని గురించి ఎలాంటి క్లారిటీ లేదు. ఉద్యోగులకు సైతం ఎలాంటి సమాచారం అందడం లేదు. ఆరోగ్యశ్రీ పథకం ఉంటుందా, లేదా అనేది అర్థం కాని పరిస్థితి. ఆయుష్మాన్ భారత్ పథకానికైతే ప్రస్తుతం హెచ్‌హెచ్‌ఆర్, పీఆర్ లాగిన్ ఐడీలు చేయిస్తున్నారు. ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

– సి.కంబగిరి, జిల్లా అధ్యక్షుడు, ఏపీ వైద్యసేవ ఎంప్లాయీస్ యూనియన్, కర్నూలు

శ్రీశైలంకు తగ్గుతున్న వరద

- ఒక గేటు ద్వారా దిగువకు నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గుతుంది. ఒక రేడియల్ క్రస్ట్ గేటు ద్వారా నాగార్జునసాగర్‌కు నీటివిడుదల కొనసాగుతుంది. రోజుకు సుమారు 1,80,000 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా, ఆదివారం సాయంత్రం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టి సగటున 80,000 క్యూసెక్కులకు చేరింది. జలాశయంలో 206.0996 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటి మట్టం 883.30 అడుగులకు చేరుకుంది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 1,58,670 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 1,22,185 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు స్పిల్‌వే ద్వారా 32,762 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 67,823 క్యూసెక్కులు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 20,000 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 17.414 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.721 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

శ్రీగిరి కిటకిట


మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి మల్లన్న దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో మల్లన్న స్పర్శ దర్శనం టికెట్లు పొందినభక్తులు మూడు విడుతలుగా దర్శనం చేసుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పుర వీధులన్నీ కిటకిటలాడాయి. మరో వైపు శ్రీశైలం డ్యామ్ గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతుండంతో తిలకించేందుకు పర్యాటకులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు.



'కూటమి' వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్లూరు గ్రామీణ, కల్లూరు అర్బన్ వార్డుల మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. - కల్లూరు

నెల రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


శిరోల్ల రవితేజ(ఫైల్)

కృష్ణగిరి: మరో నెల రోజుల్లో పెళ్లి కావాల్సిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన శిరోల్ల రవితేజ(29) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ మధ్యనే ఇతనికి కల్లూరు మండలం చిన్నటేకూరులో ఓ అమ్మాయితో వివాహ నిశ్చయం జరిగింది. మరో నెల రోజుల్లో పెళ్లి జరిపేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. అయితే ఆదివారం రవితేజ తన బంధువు అయిన మరో వ్యక్తితో బెంగళూరులో బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా కారు వచ్చి ఢీకొట్టింది. దీంతో తలకు హెల్మెట్ ఉన్న రవితేజతోపాటు మరో వ్యక్తి కూడా అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీరని శోకంతో బెంగళూరుకు వెళ్లారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీ దారులు తమ దరఖాస్తులు పరిష్కారం కాకు న్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తులను ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap. gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు తమ అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు అధికారులందరూ హాజరు కావాలన్నారు.

'తిమ్మప్ప' కొండలో శిలాయుగం ఆనవాళ్లు

కోసిగి: తిమ్మప్ప స్వామి కొండలో శిలాయుగం నాటి ఆనవాళ్లు ఉన్నట్లు రాష్ట్ర పురావస్తు ప్రదర్శన శాల శాఖ సాంకేతిక సహాయకులు మహేంద్ర నాయుడు, ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు ఆవుల రాఘవేంద్ర తెలిపారు. ఆదివారం కొండపైన వారు పరిశీలన చేశారు. శిలాయుగం నాటి సమాధులను గుర్తించారు. వీటిలో కొన్ని ధ్వంసం అయినట్లు తెలిపారు. మిగిలిన వాటిని సంరక్షించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు.


కొండను పరిశీలిస్తున్న పురావస్తు అధికారులు

ఆగస్టు 27 నుంచి గణేశ్ మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: వినాయక చవితి ఉత్సవాలు ఆగస్టు 27వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా సంఘటనా కార్యదర్శి డాక్టర్ నాగఫణి శాస్త్రి వెల్లడించారు. ఆదివారం వినాయక ఘాట్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, గూడూరు, ఇతర పట్టణాల్లో ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరుగుతాయన్నారు. కర్నూలు నగరంలో ఈఏడాది 44వ ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. సెప్టెంబర్ 4వ తేదీ వరకు 9 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవ సమితి కార్యాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, కోశాధికారి ఏవీ ప్రసాద్, కర్నూలు నగర ఉత్సవ సమితి అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి గిరిరాజ వర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ. 10 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాల నిలిపివేత



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: ఎరువుల దుకాణంలో ఓ ఫామ్ ఇంక్లూడ్ చేయనందున్న రూ. 10 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి మదిరెపల్లి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మంత్రాలయం రోడ్డులోని శ్రీ మల్లికార్జున ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఏవో ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో రికార్డులు, స్టాక్, లైసెన్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణంలో ఎరువుల అమ్మకాలకు సంబంధించిన ఓ ఫామ్ ఇంక్లూడ్ చేయనందున్న అమ్మకాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు. స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చేయనందుకు స్టాక్ రిజిస్టర్ బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్ టాలీ కానందున 42 యూరియా బస్తాల అమ్మకాలను కూడా నిలుపుదల చేసినట్లు తెలిపారు.

జేవీవీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్‌కుమార్



సురేష్‌కుమార్, శేషాద్రిరెడ్డి, మహమ్మద్‌మియ్యా

కర్నూలు(హాస్పిటల్): జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.సురేష్‌కుమార్ ఎంపికయ్యారు. జేవీవీ రాష్ట్ర 18వ మహాసభలు ఈ నెల 12, 13వ తేదీల్లో కడప నగరంలో నిర్వహించారు. ఈ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. అందులో సురేష్‌కుమార్‌తో పాటు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేషాద్రిరెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా మహమ్మద్ మియ్యా, శిక్షణా విభాగానికి అధ్యక్షులుగా ప్రతాపరెడ్డి, వ్యవసాయ రంగానికి రామకృష్ణారెడ్డి ఎంపికయ్యారు. ఈ కమిటీలో ఎక్కువ మంది జిల్లాకు చెందిన వారే ఉండటం హర్షణీయమని, ఇది జిల్లాకు దక్కిన గౌరవమని, మరింత బాధ్యతగా పనిచేసే వేదికను విస్తృత పరచాలని వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి ఆకాంక్షించారు.

పదోన్నతులు లేకుండా నోటిఫికేషన్ ఎలా?

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 17న వాక్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌పై వైద్యుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్ట్ విధానంలో 40 ప్రొఫెసర్లు, 37 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ కావడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు విధానంలో రిటైర్డ్ అయిన వైద్యులను ఈ నోటిఫికేషన్ ద్వారా తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల కర్నూలుకు వచ్చిన ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటి వీసీ డాక్టర్ పి. చంద్రశేఖర్, అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్‌లను నిలదీశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో చాలా మంది వైద్యులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని, వీరిని కాదని, తాజాగా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడం ఏమిటని మండిపడుతున్నారు. దీనివల్ల సీనియారిటీ సమస్యలు వస్తాయని, ముందుగా పదోన్నతులు నిర్వహించి, ఖాళీగా ఉన్న, ఎవ్వరూ రాని పోస్టుల్లో మాత్రమే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అంతవరకు ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని వారు కోరుతున్నారు. దీంతో ఈ విషయమై డీఎంఈ అధికారులు సైతం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలో ఓ నిర్ణయానికి రానున్నట్లు సమాచారం.

తుంగాతీరం.. విషాదం

- గల్లంతైన ముగ్గురు యువకులు మృతి
- పుష్కర ఘాట్ వద్ద మృతదేహాలు లభ్యం
- శోకసంద్రంలో మృతుల కుటుంబీకులు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మంత్రాలయం: విహారయాత్ర నిమిత్తం మంత్రాలయం వచ్చిన ఏడుగురు యువకుల్లో ముగ్గురు విగతజీవులుగా మారడంతో తుంగాతీరంలో విషాదం అలుముకుంది. తుంగభద్ర నదిలో శనివారం గల్లంతైన ముగ్గురు యువకులు ఆదివారం శవమై తేలారు. కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా అర్సికెరి మండలం జావగల్ గ్రామానికి చెందిన ఏడుగురు స్నేహితులైన రఘునాథ్, నారాయణ, దర్శన్, హేమంత్, అజిత్, సచిన్, ప్రమోదులు శనివారం మంత్రాలయం చేరుకున్నారు. కాగా పుణ్యస్నానాలు ఆచరణలో భాగంగా సాయంత్రం తుంగభద్ర నదికి స్నానాలకు వెళ్లగా వరద నీటి ఉధృతిలో రమేష్ కుమారుడు అజిత్, కుమార్ కొడుకు సచిన్, మోహన్ కుమారుడు ప్రమోదులు కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటి పడటంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. ఆదివారం ఉదయం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ నేతృత్వంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం, స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన యువకుల మృతదేహాలు పుష్కర ఘాట్ వద్ద లభ్యమైయ్యాయి. విగతజీవులుగా తమ కుమారులు బయటపడటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. వారి రోదనలతో తీరం అంతా కన్నీటి సంద్రంగా మారింది. చేతికి వచ్చిన కుమారులు మృత్యువాత పడటంతో అటు తల్లితండ్రులు, స్థానికులను ఎంతగానో కలిచి వేసింది.



గల్లంతుకు ముందు శ్రీ మఠం వద్ద స్నేహితులందరూ తీసుకున్న ఫొటో

మృతదేహాలు స్వస్థలాలకు తరలింపు..

గల్లంతైన యువకుల మృతదేహాలు ఆదివారం ఉదయం 10.40 గంటలకు పుష్కరఘాట్ వద్ద లభ్యమైయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను శ్రీ మఠం అంబులెన్స్ ద్వారా ఎమ్మిగనూరుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారి స్వస్థలాలకు తరలించారు. కాగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం, స్థానిక మత్స్యకారులు సాహసోపేతంగా మృతదేహాల గాలింపు కోసం శ్రమించారు. వారి కష్టం పట్ల స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో స్థానిక తహసీల్దార్ రమాదేవి, కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్, ఆర్ఐ జనార్ధన్‌రావు, వీఆర్వో భీమన్న పాల్గొన్నారు.

మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దారుణం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కొలిమిగుండ్ల: ఉమ్మడి కృష్ణా జిల్లా బీసీ మహిళా జెడ్పీచైర్‌పర్సన్‌పై దాడికి దారుణమని, దాడులకు పాల్పడ్డ టీడీపీ, జనసేన నాయకులపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి డిమాండ్ చేశారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి వెళుతున్న ఆమె కారును చుట్టుముట్టి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కొలిమిగుండ్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేబినెట్ హోదా కలిగిన జెడ్పీచైర్‌పర్సన్ వెళుతుంటే అడ్డుకొని దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి దుష్ట కార్యక్రమాలు గతంలో ఎప్పుడూ చోటు చేసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్దేశపూర్వకంగా నిత్యం ప్రజల్లో తిరిగే జెడ్పీచైర్మన్‌లకు గన్‌మెన్‌లను తొలగించారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన చైర్‌పర్సన్‌లు ఉన్నారనే అక్కసుతోనే ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకుందన్నారు. తక్షణమే గన్‌మెన్‌లను పునరుద్ధరించాలని కోరారు.

గంగమ్మకు బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో రజకులు ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం మొక్కుబడిలో భాగంగా రజకులు వివిధ ప్రత్యేక పూజలు చేశారు. వివిధ వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. మహిళలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షం కోసం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

తెలుగును అధికార భాషగా అమలు చేయాలి

- రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు

కర్నూలు కల్చరల్: తెలుగును అధికార భాషగా అమలు చేయాలని, బోధన, పాలన మాతృభాషలోనే సాగాలని విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు అన్నారు. కర్నూలు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ఆదివారం ముగిసింది. తమిళనాడు రాష్ట్రం తెలుగు భాషా సంఘం అధ్యక్షులు తూమాటి సంజీవరావు, సదస్సు సమన్వయకర్త పత్తి ఓబులయ్య, సదస్సు అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, ఉపాధ్యక్షులు జీఎస్ఆర్కే శర్మ, కార్యదర్శి డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. మాతృభాషను కాపాడుకునే దిశలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. తూమాటి సంజీవరావు రచించిన 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకావిష్కరణ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వారు చేసిన ప్రతి పాదనలను తీర్మానాలుగా చేశారు. వీటిని అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని నిర్ణయించారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలలో వారివారి మాతృభాషలను ఎలా కాపాడుకుంటున్నారో తెలుగును అధికార భాషగా వంద శాతం అమలు చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, శ్యామసుందర శాస్త్రి, లక్ష్మయ్య, గుబ్బ బాలస్వామి, హైమావతి, నీలిమ, సునీత, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పలువురికి పదవులు దక్కాయి. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మేధావుల ఫోరం కమిటీ, జిల్లా ఐటీ విభాగం కమిటీ, జిల్లా గ్రీవెన్స్ కమిటీలను నియమించారు. ఆయా కమిటీలలో పలువురికి చోటు కల్పిస్తూ ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

జిల్లా మేధావుల ఫోరం కమిటీలో..

ఉపాధ్యక్షులుగా బి. భీమా శంకర్ రెడ్డి (పాణ్యం), నాగేశ్వర రెడ్డి (కోడుమూరు), ప్రధాన కార్యదర్శులుగా ఆర్. విజయమోహన్ రెడ్డి (పత్తికొండ), సుంకన్న (ఆలూరు), జి. నాగేశ్వర్ (మంత్రాలయం), ఆర్. నాగర్జున రెడ్డి (కర్నూలు), పి. బాబు ఖాన్ (ఎమ్మిగనూరు), కె. మధుసూదన్ (ఆదోని), కార్యదర్శులుగా జానకీ రామి రెడ్డి (ఎమ్మిగనూరు), కె. కేశవ రెడ్డి (పత్తికొండ), శివన్న (ఆలూరు), కె. వెంకటేశ్వర్లు (మంత్రాలయం), వి. సత్యనారాయణ (పాణ్యం), రాము, రమేష్ రెడ్డి, వర ప్రసాద్ (కర్నూలు), వర ప్రసాద్ (కోడుమూరు), సి. మల్లికార్జున (ఆదోని), కార్యనిర్వాహక సభ్యులుగా నాగిరెడ్డి (ఎమ్మిగనూరు), బి. సుబ్బయ్య (పత్తికొండ), కంచెప్ప (ఆలూరు), కె. ఉచ్చన్న (మంత్రాలయం), కె. మదుసూధన్ రెడ్డి (పాణ్యం), బి. మంజునాథ్ (ఆదోని)లను నియమించారు.

జిల్లా ఐటీ విభాగ కమిటీలో...

ఉపాధ్యక్షులుగా ఎ. రాజేష్ (ఆదోని), పి. హరిష్ రెడ్డి (పత్తికొండ), ప్రధాన కార్యదర్శులుగా పి. షేక్షావలి (మంత్రాలయం), కె. నరేంద్ర నాథ్ రెడ్డి (కర్నూలు), బండ రాజశేఖర్ (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా బుగిడే క్రిష్ణ (ఎమ్మిగనూరు), కె. రామచంద్ర (పత్తికొండ), కె. శివరామ్ (మంత్రాలయం), యం. జాకీర్ బాషా (ఆదోని), సురేంద్ర బాబు (కర్నూలు), కార్యనిర్వాహక సభ్యులుగా షాషావలి (ఎమ్మిగనూరు), పి. చక్రపాణి రెడ్డి (పత్తికొండ), లక్ష్మన్న (మంత్రాలయం) బోయ అనిల్ (ఆదోని)లను నియమించారు.

జిల్లా గ్రీవెన్స్ విభాగ కమిటీలో...

ఉపాధ్యక్షులుగా కె. భాస్కర్ రెడ్డి (పత్తికొండ), బండి తహీర్ బాషా (ఆదోని), ప్రధాన కార్యదర్శులుగా తిమ్మప్ప (ఆలూరు), అబూబకర్ (కర్నూలు), సి.అనిల్ కుమార్ (మంత్రాలయం), హెచ్. హజ్రత్ బిలాల్ (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా బండె నవాజ్ (ఎమ్మిగనూరు), జయచంద్రారెడ్డి (పత్తికొండ), లింగప్ప (ఆలూరు), జి. రామాంజనేయులు (మంత్రాలయం), బి. నిసార్ అహమ్మద్ (ఆదోని), మహేష్ (కర్నూలు), కార్యనిర్వాహక సభ్యులుగా బి. మహమ్మద్ నాసీర్ (ఎమ్మిగనూరు), డి. జయభరత్ రెడ్డి (పత్తికొండ), నాగేంద్ర (ఆలూరు), ముఖీ రెడ్డి (మంత్రాలయం), తెలుగు చంద్రశేఖర్ (ఆదోని), ఎస్. అమీన్ బాషా (కర్నూలు)లు నియమితులయ్యారు.

అడ్డంకులు ఉన్నా కేసీకి నీరు విడుదల!



పూజల్లో పాల్గొన్న ఎంపీ తదితరులు



కర్నూలు స్వామిరెడ్డినగర్ సమీపంలో కేసీలో వదిలేసిన మట్టి కుప్పలు

- కేసీ కెనాల్‌లో తొలగని మట్టి కుప్పలు
- కాలువ నిండా పేరుకపోయిన చెత్త, చెదారం
- సుంకేసుల నుంచి నీటిని విడుదల చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు సిటీ: కర్నూలు–కడప కాలువ (కేసీ కెనాల్)లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉన్నా, అడ్డుగా మట్టి కుప్పలు ఉన్నా కనీస చర్యలు తీసుకోకుండా ఆదివారం సుంకేసుల జలాశయం నుంచి సాగు నీటిని విడుదల చేశారు. దీంతో కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఎదురొచ్చాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల సాగు నీటి సలహా మండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయం మేరకు సుంకేసుల బ్యారేజీ దగ్గర ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, జయసూర్య, కేసీ కెనాల్ డీఈఈ ఎస్.ప్రసాద్‌రావులు మోటర్ ఆన్ చేసి కేసీకి నీటిని విడుదల చేశారు. తొలుత 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి, రాత్రి 7 గంటలకు మరో 250 క్యూసెక్కులు, సోమవారం నుంచి రెండు, మూడు రోజుల్లోనే 2500 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచనున్నట్లు కేసీ ఇంజినీర్లు చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ఆందోళనలతోనే..

జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. ఎగువన కురిసిన వర్షాలతో కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు భారీగా వరద వచ్చింది. డ్యాం నుంచి తుంగభద్ర నదికి నీటిని విడుదల చేసినా, సుంకేసుల జలాశయానికి భారీగా నీరు వచ్చిన కేసీ కెనాల్‌కు చుక్క నీరు కూడా విడుదల చేయలేదు. ఎగువ నుంచి వచ్చిన నీరంతా దిగువకు విడుదల చేసేశారు. ఆ సమయంలోనైనా కేసీ కెనాల్‌లో అడ్డంకులను తొలగించలేదు. వైఎస్సార్‌సీపీ ఆందోళనలతో కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు కేసీకి నీటిని విడుదల చేసింది.

నీటి ప్రవాహానికి ఇవీ అడ్డంకులు..

- కర్నూలు–కడప కాలువ కర్నూలు నగరం మధ్యలో వెళ్తుంది. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు మొదట రూ.62 లక్షలతో అంచనాలు వేశారు. ఈ పనులు నామినేషన్‌పై చేసేందుకు సాధ్యం కాకపోవడంతో టీడీపీ నేతలకు లబ్ధి చేకూర్చేందుకు అంచనాలను తగ్గించారు.
- నామినేషన్‌పై పనులు చేసేందుకు రూ.6.4 లక్షలకు అంచనాలను మార్పులు వేసి 6 పనులుగా విభజించారు.
- సుమారు రూ.36 లక్షలతో టీడీపీ సీనియర్ నేత నీటి వినియోగదారుల సంఘాల పేరుతో పూడిక తీత పనులు అసంపూర్తి చేశారని సమాచారం.
- కర్నూలులోని స్వామిరెడ్డినగర్, స్టాంటన్‌పురం, బంగారుపేట, జొహరాపురం సమీపంలోని కేసీ కెనాల్‌లో పైపైనే పూడికతీసి వదిలేశారు. కొన్ని చోట్ల మట్టి కుప్పలు కాల్వ మధ్యలోనే వదిలేశారు.
- పనులు పూర్తికాకుండానే కాల్వకు నీరు వదలడంతో ఆ మట్టి కుప్పలు నీటిలోనే కలిసిపోయాయి.

'థైరాయిడ్' చికిత్సపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): థైరాయిడ్ గ్రంధి చికిత్సపై వైద్య విద్యార్థులు మరింత అవగాహన పొందాలని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ చెప్పారు. డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆదేశాల మేరకు ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ హరిచరణ్ అధ్యక్షతన జోనల్ సీఎంఈ నిర్వహించింది. ఇందులో కర్నూలు మెడికల్ కాలేజి, అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజి, శాంతిరామ్ మెడికల్ కాలేజి, విశ్వభారతి మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో భాగంగా థైరాయిడ్ జబ్బుల గురించి సీఎంఈ నిర్వహించారు. థైరాయిడ్ గ్రంధికి సంబంధించిన వివిధ వ్యాధుల గురించి, అందులో వచ్చే వివిధ రకాల క్యాన్సర్ల గురించి, వాటి చికిత్స గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ థైరాయిడ్ గ్రంధి శరీరంలో చాలా ముఖ్యమైనదన్నారు. వాటికి సంబంధించిన వివిధ రకాల జబ్బుల గురించి పీజీలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ థైరాయిడ్ గ్రంధి సైజు పెరిగినప్పుడు తప్పకుండా సర్జన్లకు చూపించుకుని దానికి పరీక్షలు చేయించి అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం నాలుగు కాలేజీలకు జరిగిన క్విజ్ పోటీలో కర్నూలు మెడికల్ కాలేజి పీజీలు ప్రథమ స్థానం, శాంతిరామ్ మెడికల్ కాలేజి పీజీలు రెండో స్థానం పొందారు. కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, సీఎంఈ అబ్జర్వర్ డాక్టర్ విశాల, సీఎంఈ సర్జరీ కో ఆర్డినేటర్ డాక్టర్ మాధవీశ్యామల, జనరల్ సర్జరీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు పాల్గొన్నారు.

'పశుబీమా'కు రూ.12 లక్షలు

కర్నూలు(అగ్రికల్చర్): పశుబీమా పథకం అమలుకు ప్రభుత్వం వాటా ప్రీమియం చెల్లించేందుకు రూ.12 లక్షలు మంజూరు అయ్యాయని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలన్నీ పశుబీమా పథకాన్ని వినియోగించుకోవచ్చని కోరారు. ఒక కుటుంబానికి గరిష్ఠంగా 10 పశువుల వరకు బీమా చేసుకోవచ్చని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకసారి బీమా చేసుకుంటే మూడేళ్ల వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ నాటు పశువులకు రూ.816, మేలు జాతి పశువులకు రూ.1632 వరకు ఉంటుందని తెలిపారు. రూ.15 వేల విలువకు బీమా చేయించుకుంటే ప్రీమియం రూ.960 ఉంటుందని, ఇందులో ప్రభుత్వం రూ.816 భరిస్తుందని, రైతు రూ.149 చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. రూ.30 వేల విలువకు బీమా చేయించుకుంటే ప్రీమియం రేటు రూ.1920 ఉందని, ఇందులో ప్రభుత్వం రూ.1,632 భరిస్తుందని, రైతు రూ.298 భరించాల్సి ఉందని పేర్కొన్నారు. మేలు జాతి పశువులకు రూ.30 వేల నుంచి రూ.లక్ష విలువ వరకు బీమా చేసుకోవచ్చని, విలువను బట్టి ప్రీమియం రేటు మారుతుందని పేర్కొన్నారు. రూ.లక్ష విలువకు బీమా చేయించుకుంటే ప్రీమియం రేటు రూ.6,400 ఉందని, రైతులు రూ.4,937 భరించాల్సి ఉందని పేర్కొన్నారు.

కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్ల నియామకం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్లుగా పదిమందిని నియమించినట్లు జిల్లా జీసీడీఓ నాగసువర్చల పేర్కొన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, ఎంపీయూపీ, ఏపీ మోడల్ స్కూల్, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, ఏపీఆర్ఈఐఎస్, ఇతర పాఠశాలల్లో ప్రతి కౌన్సిలర్ రెండు నుంచి 3 మండలాల వరకు కనీసం 18 నుంచి 20 పాఠశాలల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. మానసిక ఆరోగ్య సేవలు, జీవన నైపుణ్య శిక్షణ, వ్యక్తిగత కౌన్సెలింగ్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమన్వయం వంటి అంశాలు ఉంటాయన్నారు. పరీక్షల భయం, ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలకు వ్యక్తిగత కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే విద్య, ఉద్యోగ అవకాశాలపైన అవగాహన కల్పిస్తారన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



మృతి చెందిన సౌదామిని

నంద్యాల: పట్టణంలో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు నంద్యాల త్రీటౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానిక నౌమాన్‌నగర్‌కు చెందిన వేదావతి, రమేష్‌ల కుమార్తె సౌదామిని (17) పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కంబగిరి రాముడు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

దంపతులను కలిపిన హెచ్ఆర్ఏజే

కొలిమిగుండ్ల: విభేదాలతో కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్న దంపతులు ఆదివారం ఒకటయ్యారు. మదనంతపురానికి చెందిన శివశంకరరెడ్డికి చింతలాయిపల్లెకు చెందిన పద్మావతితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి అయిన కొన్నాళ్లకు కుమార్తె పుట్టింది. ఆ తర్వాత ఆ దంపతుల మధ్య విభేదాలు రావడంతో పద్మావతి బిడ్డతో పుట్టినింటికి చేరుకుంది. శివశంకర రెడ్డి కుటుంబ సభ్యులు కాపురానికి తీసుకొచ్చేందుకు చాలా సార్లు ప్రయత్నం చేసినా కుదరలేదు. చివరకు హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాకర్ల సరస్వతి దృష్టికి ఈ సమస్య వెళ్లింది. దీంతో మదనంతపురానికి చేరుకున్న ఆమె బృందం దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు కలిసి ఉండేందుకు అంగీకరించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత దంపతుల సమస్య పరిష్కారం కావడంతో ఇరు కుటుంబాల సభ్యులు హెచ్ఆర్ఏజే సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్మీలో పని చేసిన పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

26 ఏళ్ల తర్వాత..

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను కలుసుకొని వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ముందుగా పాఠశాల వ్యవస్థాపకుడు శేషారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, వెంకటరావు, సురేంద్రనాథ్ రెడ్డి, ఆనంద్, అనీఫ్, తిరుపాలు, శివ కుమారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్ఎం ఆదినారాయణ తదితరులు మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో మెలిగిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. 26 ఏళ్ల తర్వాత అందరినీ గుర్తుంచుకొని సన్మానించడం అభినందనీయమన్నారు. అలాగే ఆర్మీలో పని చేసి రిటైర్డ్ అయిన పూర్వ విద్యార్థులు ఎల్లనాగయ్య, మదన్, మద్దిలేటిని ఈ సందర్భంగా సన్మానించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో ఉన్న పూర్వ విద్యార్థి శీలం వరలక్ష్మికి తమ వంతు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఫయాజ్, విజయ్, నారాయణ స్వామి, రామాంజనేయులు, నరసింహ, భాస్కర్, అమర్, ప్రసాద్, సునీత, వరలక్ష్మి, శ్రీదేవి, లక్ష్మి, జరీనా, ఆశా తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు



గాయపడ్డ యూపీకి చెందిన కార్మికుడు

ఆలూరు రూరల్: అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని అగ్రహారం గ్రామం సమీపంలో ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. యూపీ రాష్ట్రానికి చెందిన దీపన్, మనీష్, కమల్ అనే కార్మికులు కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి ఆటోలో ఆదోనికి వెళ్తున్నారు. అగ్రహారం గ్రామం వద్ద గుంతను తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో ఆ ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు.